

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 15-07-2026 | సంపుటి : 08 | సంచిక 33 | పేజీలు : 8 | వెల : రూ 3-00


## పాలసీలు తీసుకురావడం సులభమే..

# అమలే అత్యంత కీలకం: సీఎం చంద్రబాబు



అమరావతి, జులై 14: 2019-2024 మధ్య ఏపీలో వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. రాష్ట్రంలో ఆ ఐదేళ్లూ విధ్వంసం జరిగిందన్నారు. మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశంలో సీఎం మాట్లాడుతూ... గడిచిన రెండేళ్లు సమష్టిగా పనిచేశామని.. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు అర్థం చెప్పామన్నారు. ప్రభుత్వ ఆలోచనల్ని ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా అమలు చేసిందని కొనియాడారు. ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగామని.. మరిన్ని రంగాల్లో మెరుగుపడాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.ప్రతి ప్రభుత్వ శాఖ ఎప్పటికప్పుడు తాము సాధించిన ఫలితాలను బేరీజు వేసుకోవాలని సీఎం సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల సదస్సు నిర్వహించటంతో పాటు జీఎస్డీపీని విశ్లేషించుకుంటున్నామని చెప్పారు. 2047 వికసిత్ భారత్ బాటలోనే స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపకల్పన చేశామన్నారు. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 57 కేబినెట్ సమావేశాలు నిర్వహించామన్నారు. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయిందన్నారు. కానీ ఆ పరిస్థితిని పునరుద్ధరించామని.. మళ్లీ ఏపీ మోస్ట్ ప్రిఫర్డ్ డెస్టినేషన్‌గా అవతరించిందని వెల్లడించారు. పెద్దఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని.. తద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయన్నారు.వనరుల్ని సమర్థంగా వినియోగించుకోవాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయాధారిత రాష్ట్రంగా ఉన్న ఏపీని పారిశ్రామికంగానూ అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటలు, ఖనిజ వనరులు, కోస్తా జిల్లాల్లో ఆక్వా ఇలా వేర్వేరు రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, చీమకుర్తి గ్రానైట్ సహా విలువైన వనరులకు వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉందన్నారు. 'టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన వద్ద ఉంది. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి' అని పేర్కొన్నారు. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. ప్రతి నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం నిర్వహించుకోవటం ద్వారా పురోగతిని సమీక్షించుకుందామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## ఉడాన్ పథకం మరో పదేళ్లు

# పొడిగిస్తున్నాం: రామ్మోహన్

ఢిల్లీ, జులై 14 ఉడాన్ పథకాన్ని మరో పదేళ్లు పొడిగిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. రూ.30 వేల కోట్లతో 100 కొత్త ఎయిర్‌పోర్టులు, 200 హెలిపోర్టులే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. భారత్‌ను ప్రపంచ ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. 2028 జూన్ 2వ తేదీ నాటికి వరంగల్ ఎయిర్‌పోర్ట్‌ను పూర్తి చేయడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈరోజు (మంగళవారం) ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుని కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో రామ్మోహన్ మాట్లాడారు.బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా మామునూరును తీర్చిదిద్దుతామని రామ్మోహన్ పేర్కొన్నారు. తన హయాంలోనే మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను వేగవంతం చేయాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. బౌండరీ వాల్, రన్‌వే టెండర్లు సిద్ధం చేశామని వెల్లడించారు. 3 నుంచి 4 వారాల్లో టెర్మినల్ భవనం టెండర్లు పిలుస్తామని వివరించారు. కాకతీయ కళావైభవాన్ని ప్రతిబింబించే విధంగా టెర్మినల్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. దేశంలోనే అత్యుత్తమ ఎయిర్‌పోర్ట్‌గా వరంగల్‌ను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం 253 ఎకరాల భూమిని రికార్డు సమయంలో అప్పగించిందని రామ్మోహన్ తెలిపారు.



# మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు: మంత్రి అచ్చెన్న



అమరావతి: విశాఖలో పర్యటించిన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫైర్ అయ్యారు. మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని మంత్రి అచ్చెన్న మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి అనేక మంది మత్స్యకారులు చనిపోయారని, విపత్తుల కారణంగా మొత్తం 270 మంది మృతిచెందారని పేర్కొన్నారు. అయితే, జగనే వారిని చంపేశారని అంత అవివేకంగా తాము మాట్లాడమని అన్నారు. నాడు మృతిచెందిన 270 మందిలో ఏ ఒక్క కుటుంబాన్ని ఇప్పటివరకు ఎందుకు పరామర్శించలేదని జగన్‌ను మంత్రి అచ్చెన్న ప్రశ్నించారు.ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ..'గొడ్డలి పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి నేడు విశాఖ పర్యటనకు వెళ్లారు. మీ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఓ వ్యక్తిని తన వాహనంతో ఢీకొట్టాడు. వైద్యం చేయించకపోవడంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ఆ వ్యక్తిని పలకరించడానికి వెళతావేమో అనుకున్నా. గొడ్డలి పార్టీ అబద్ధాల పునాదులపై పుట్టింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల విశాఖలో ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. అలాంటి విపత్తుల సమయంలో వెంటనే స్పందించి వారి ప్రాణాలు కాపాడే చరిత్ర సీఎం చంద్రబాబు నాయుడిది. ప్రభుత్వం వెంటనే స్పందించినా సాంకేతిక కారణాల వల్ల మత్స్యకారుల బోటు ఎక్కడ మునిగిపోయిందో తెలియక కాపాడలేకపోయాం.ఈ నెల 4వ తేదీన ఉదయం 10:30 గంటలకు బోటు గల్లంతైనట్లు మాకు సమాచారం అందింది. ప్రమాదాలు జరగకూడదనే ఉద్దేశంతో ప్రతి బోటుకు ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేశాం. విపత్తు వచ్చినప్పుడు ట్రాన్స్‌పాండర్‌ను నొక్కితే సమాచారం తెలుస్తుంది. ట్రాన్స్‌పాండర్‌ను నొక్కిన వెంటనే వారు ఏ ప్రాంతానికి వెళ్లారో తెలుసుకుని, 11:30 గంటలకు కోస్ట్ గార్డ్, నేవీకి సమాచారం ఇచ్చి ఆపరేషన్ ప్రారంభించాం. నేడు కిలోమీటర్లకు, నాటికల్ మైళ్లకు తేడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారు. 11 నాటికల్ మైళ్ల దూరంలో సంఘటన జరిగింది. వెంటనే మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి బాధిత కుటుంబసభ్యుల వద్దకు, పోర్టు వద్దకు పంపాం. 30 ఏళ్లుగా ఏ సంఘటన జరిగినా వెంటనే అక్కడ ఉండే వ్యక్తి అచ్చెన్నాయుడు. నీ పాలనలో 270 మంది చనిపోతే కనీసం పరిహారం ఇవ్వలేదు.వైసీపీ అధికారం కోల్పోయాక ఎన్డీఏ ప్రభుత్వం ఆ పరిహారం ఇచ్చింది. మీకు తల్లి లేదు, చెల్లి లేదు, బాబాయి లేరు.. అందర్నీ చంపేస్తావు. చిన్నా, పెద్దా తేడా లేకుండా మీ మంత్రి (సీదిరి అప్పలరాజు) నాడు మాట్లాడారు. మీ మాజీ మంత్రి కుమారుడు ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతోనే దానయ్య చనిపోయారు. వెంటనే ఆస్పత్రిలో చేర్చి ఉంటే దానయ్య బతికేవారు. మేము మాత్రం గల్లంతైన ఏడుగురిలో ఓ మత్స్యకారుడిని సురక్షితంగా కాపాడాం. ఆస్పత్రికి తరలించి మంచి చికిత్స అందించాం. జగన్ చేసే చౌకబారు వ్యాఖ్యలను నమ్మేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు సిద్ధంగా లేరు' అని మంత్రి అచ్చెన్న చెప్పుకొచ్చారు.

# వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి కన్నుమూత..



కాకినాడ: వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి(73) మృతిచెందారు. అనారోగ్య సమస్యలతో చికిత్సపొందుతూ ఈరోజు (మంగళవారం) సాయంత్రం 6 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. కిడ్నీ సమస్యలతో గత నెల 16న హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చేరారు. అప్పటి నుంచి అక్కడ ముద్రగడకి చికిత్స జరుగుతోంది. అయితే, ఇవాళ సాయంత్రం పరిస్థితి విషమించడంతో ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రాణాలు కోల్పోయారు. కాగా, ముద్రగడ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి. 1953 జనవరి 22న ఆయన జన్మించారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తన జీవిత కాలంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, ఒకసారి ఎంపీగానూ ఆయన పని చేశారు. ముఖ్యంగా కాపు ఉద్యమ నేతగా ఆయనకు మంచి గుర్తింపు లభించింది.

## మూడు రెట్లు ధరకు స్టాంపులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 14:నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్టాంపు పత్రాల విక్రయంలో భారీ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాల్సిన నాన్ జ్యుడీషియల్ స్టాంపు పత్రాలను కొందరు లైసెన్సు కలిగిన విక్రేతలే మూడు రెట్ల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు




బా ది. తె ం లం ఆరోపిస్తున్నారు. రూ.100 విలువైన స్టాంపు పత్రాన్ని రూ.300కు, రూ.50 స్టాంపును రూ.200కు, రూ.20 స్టాంపును రూ.120కు విక్రయిస్తూ ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరంగా రిజిస్ట్రేషన్‌లు, అఫిడవిట్లు, ఒప్పందాలు, ఇతర న్యాయపరమైన అవసరాల కోసం వచ్చే ప్రజల పరిస్థితిని ఆసరాగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిసరాల్లోనే ఈ వ్యవహారం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. స్టాంపు పత్రాల కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయిస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం, స్టాంపులు?రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలు వెలికితీసి అక్రమాలు రుజువైతే బాధ్యులైన లైసెన్సు విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## డొనేషన్ స్కీంలో మార్పులు.. సామాన్య భక్తులకే ప్రాధాన్యం.. టీటీడీ కీలక నిర్ణయం

తిరుమల, జులై 14: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలకమండలి సమావేశం ముగిసింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అజెండాలోని 72 అంశాలను చర్చించినట్లు టీటీడీ చైర్మన్ తెలిపారు. నిత్య హారతులపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేశారని.. తిరుమలలోని నిబంధనలపై లేఖ ద్వారా ఆయనకు తెలియజేయనున్నట్లు చెప్పారు. రూ.6.31 కోట్లతో తిరుమలలోని ఏటీసీ వద్ద ఎస్ఎస్డీ టోకెన్స్ భక్తుల కోసం శాశ్వత క్యూ లైన్లను నిర్మిస్తామన్నారు. కుమారధార, పసుపు ధార వద్ద రూ.2.77 కోట్లతో బ్రిడ్జి నిర్మాణంతో పాటు, గ్రీన్ ఎనర్జీ అభివృద్ధి కోసం జీఎన్సీ వద్ద 800 కిలో వాట్స్ విండ్ మిల్ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.ఎస్వీ మ్యూజియంలో 12 ఏళ్లు పైబడిన వారికి రూ.50 టికెట్ ధరను నిర్ణయించామని, మ్యూజియం నిర్వహణను టాటా కంపెనీకి ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపుతామని టీటీడీ చైర్మన్ చెప్పారు. కాకుల మానుకొండ వద్ద ఉన్న వేల టన్నుల వేస్ట్‌ను తరలించేందుకు రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా టీటీడీ ఆలయాల్లో రూ.2.35 కోట్లతో ఫైర్ సేఫ్టీ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. ఏటీసీ, టీబీసీ వద్ద 12 పాత భవనాలు తొలగించి దాతల సహకారంతో నూతన భవనాలు నిర్మిస్తామన్నారు. 2027 డైరీ, క్యాలెండర్ ప్రింటింగ్ టెండర్లను అతి తక్కువ ధరకే ఇచ్చేలా ఆమోదం తెలిపామన్నారు. రూ.2.91 కోట్లతో అక్టోపస్ బేస్ క్యాంపు వద్ద ఎఫ్ఎంఎస్ పనుల నిర్వహణకు ప్రభుత్వానికి ప్రతిపాదన చేయాలని పాలకమండలి సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు.ఒంటిమిట్టలో బంగారు కవచం తయారీకి కేజీ బంగారు ఇచ్చేందుకు సమావేశంలో ఆమోదం తెలిపామని టీటీడీ చైర్మన్ అన్నారు.




# సంపాదకీయం

బుధవారం 15-07-2026

## యుద్ధంలో సమిధలవుతున్న సామాన్యులు

పశ్చిమాసియాలో నెలకొన్న శాంతియుత పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారిపోయాయి. ఇరాన్ ను లక్ష్యంగా చేసుకుని అమెరికా భీకర దాడులకు దిగింది. ప్రతిగా ఇరాన్ కూడా ఎదురు దాడులకు దిగింది. యుద్ధం మూలంగా కేవలం ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా నే కాకుండా సమీపంలోని లెబనాన్,గల్ఫ్ దేశాలకు తీవ్ర నష్టం కలిగించింది. అటు ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించింది. యుద్ధం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు కొరత ఏర్పడి పలు దేశాలు లాక్ డౌన్ దిశగా అడుగులు వేస్తున్నాయి. యుద్ధం మూలంగా కేవలం ఆస్తి, ఆర్థిక నష్టమే కాదు పెద్ద ఎత్తున ప్రాణ నష్టం కూడా సంభవించింది. ముఖ్యంగా ఇరాన్‌లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ముక్కుపచ్చలారని చిన్నారులు ఎందరో ఉన్నారు. ఎన్నో వందల మంది గాయాలపాలయ్యారు. పరస్పర దాడుల్లో ఆ రెండు దేశాలకు ఏ మేర నష్టం వాటిల్లిందన్న విషయాన్ని పక్కనపెడితే?ఇరాన్ దాడుల్లో భారత్ కు చెందిన ఓ వాణిజ్య నౌక ధ్వంసం కాగా? అందులోని ఓ భారతీయుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది.రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ఆ దేశాలకు చెందిన ఆస్తి, ప్రాణ నష్టాలు సర్వసాధారణమే అయినప్పటికీ? ఆ యుద్ధం కారణంగా ఇతర దేశాలకు.. అది కూడా అలీన ఉద్యమంతో ప్రపంచ శాంతికి బాటలు వేస్తున్న భారత్ లాంటి దేశాలకు నష్టం వాటిల్లుతుండటం గమనార్హం. అమెరికా, ఇరాన్ యుద్ధంలో భారత్ ఏ ఒక్క దేశానికి మద్దతు పలక లేదు. అదే సమయంలో ఇరు దేశాలు చర్చించుకుని ప్రపంచ శాంతికి పాలుపడాలని భారత్ ఆకాంక్షిస్తున్న సంగతీ తెలిసిందే. ఇలాంటి నేపథ్యంలో ఇరాన్ దాడిలో భారత నౌక ధ్వంసం కావడం, అందులోని ఓ భారతీయుడు గల్లంతు కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేందుకు జరుగుతున్న శాంతి ప్రయత్నాలపై తాజాగా జరుగుతున్న పోరాటం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఇక ఈ రెండు దేశాల మధ్య శాంత కల్లేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిపిన రెండు దాడుల కన్నా తీవ్రంగా ఆదివారం ఇరాన్‌లోని 140కు పైగా క్షిపణి, డ్రోన్ కేంద్రాలు, ఆయుధాగారాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ప్రాంతాలపై లక్షిత దాడులు చేసినట్టు అమెరికా ప్రకటించింది. 'ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అది మూల్యం చెల్లిస్తున్నది' అని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆన్‌లైన్‌లో పోస్ట్ పెట్టారు. తాము మాత్రమే హ్పార్ముజ్ జలసంధిని నియంత్రించగలమని, దాని ద్వారా పయనించే నౌకలపై చార్జీలు విధించగలమని ఇరాన్ స్పష్టం చేసింది. ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసిందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ బాఘెర్ ఘాలిబాఫ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కాగా, ఇరాన్ క్షిపణులను తాము సమర్థంగా అడ్డుకున్నట్టు ఖతార్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా క్షిపణి శకలాలు పడి ఒక పిల్లవాడు సహా ముగ్గురు పౌరులు గాయపడ్డట్టు తెలిపింది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను తాము కూడా అడ్డుకున్నట్టు కువైట్ మిలిటరీ ప్రకటించింది. ఆదివారం బహ్రెయిన్‌లో పౌరులకు మూడుసార్లు హెచ్చరిక సైరన్లు మోగాయి. సైప్రస్ జెండాతో భారత్ బయలుదేరిన జీఎఫ్ఎన్ గెలాక్సీ నౌకపై ఓమన్ తీరం సమీపంలో హర్మూజ్ జల సంధికి చేరుకున్న సమయంలో ఇరాన్ నుంచి దూసుకువచ్చిన బాంబు పడింది. దీంతో గెలాక్సీ నౌకలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. నౌకలో మంటలు చెలరేగిన సమయంలో అందులో ఉన్న 11 మంది భారతీయులు దానిని వదిలేసి చిన్నపాటి లైఫ్ బోటులో ప్రాణాలు కాపాడుకునే యత్నం చేశారు. ఈ క్రమంలో 10 మంది భారతీయులు చిన్నబోటులో సురక్షిత ప్రాంతానికి చేరుకోగా? మరో వ్యక్తి మాత్రం గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. కాగా, ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిరకు ఇరాన్‌లో 8,531 మంది మరణించారని అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం హెచ్ఆర్ఏఎన్ఏ పేర్కొంది. వీరిలో 5,607 మంది సామాన్య పౌరులు ఉన్నారని తెలపడం గమనార్హం. అంతేకాదు మృతుల్లో 1244 మంది పిల్లలు కూడా ఉన్నారని పేర్కొనడం గుండెతరుక్కుపోయే విషం. క్షేత్రస్థాయి నివేదికలు, స్థానికుల సమచారం, వైద్య, అత్యవసర వనరులు, అధికారిక ప్రకటనల ఆధారంగా తాము ఈ సమాచారాన్ని సేకరించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఆ సమాచారం ఆధారంగా ఇరాన్‌లో 5500 మందికి పైగా చనిపోయారని పేర్కొంది. ఇదిలా ఉండగా అంతర్జాతీయ సంస్థ అయిన రెడ్‌క్రాస్ వాదన మరోతీరు ఉంది. అమెరికా –ఇజ్రాయెల్ దాడుల మూలంగా ఇరాన్‌లో ఇప్పటివరకు కనీసం 3,900 మంది మరణించగా, 60,000 మంది గాయపడ్డారని పేర్కొన్నది. ఇక, మార్చి 2 నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1124 మంది చిన్నారులతో పాటు దాదాపు 3,368 మంది లెబనాన్ పౌరులు మరణించారని లెబనీస్ అధికారులు వెల్లడించారు. అలాగే, లెబనీస్ సాయుధ సంస్థ హిజ్బుల్లాకు చెందిన 400 మంది సైనికులు మరణించారని ఆ సంస్థ ప్రకటించింది. అలాగే ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాక్‌లో 702మంది మరణించారు.ఇరాన్ దాడికి ఖండిస్తూ ఆ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. దాడి జరిగిన సమయంలో ఓమన్ ప్రభుత్వం వేగంగా స్పందించి? ప్రమాదంలో పడిన భారతీయులను కాపాడిందని ఆ శాఖ తెలిపింది. భారతీయులను కాపాడిన ఓమన్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. గల్లంతైన వ్యక్తి కోసం ఓమన్ దేశ సహాయక సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టినట్లు తెలిపింది.

## రామ్ మందిర్ సీఈఓ రేసులో మాజీ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్!

అయోధ్య/న్యూఢిల్లీ, జులై 14: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు మొట్టమొదటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (అఖా) నియామక ప్రక్రియ ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక పదవి కోసం ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ దరఖాస్తు చేసుకోవడంతో ఈ రేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అమితాబ్ ఠాకూర్ 1992 బ్యాచ్‌కు చెందిన యూపీ కేడర్ ఐపీఎస్ అధికారి.నిర్బంధ పదవీ విరమణ: పలు శాఖాపరమైన విచారణలు, క్రమశిక్షణా ఫిర్యాదుల నేపథ్యంలో, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఆయన సర్వీసులో కొనసాగడానికి 'అనర్హుడు' అని పేర్కొంటూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్చి 23, 2021న ఆయనకు నిర్బంధ పదవీ విరమణ



కల్పించింది. సాధారణంగా అయితే ఆయన 2028 వరకు సర్వీసులో ఉండాల్సి ఉంది.రాజకీయ రంగప్రవేశం: పదవీ విరమణ తర్వాత ఆయన 'అధికార్ సేన' అనే కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించినప్పటికీ, చివరి నిమిషంలో ఆయన వెనక్కి తగ్గారు.'ట్రస్ట్ ఖాతాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (అంఉ) ఎప్పుడూ ఆడిట్ చేయలేదని, ఇది ఒక స్వతంత్ర సంస్థ అని ట్రస్ట్ చెబుతోంది. ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడానికి ట్రస్ట్ తన పత్రాలు, వార్షిక నివేదికలు, ఆర్థిక నివేదికలను బహిరంగంగా ప్రజల ముందు ఉంచాలి' అని అమితాబ్ ఠాకూర్ డిమాండ్ చేశారు.కాగా, భక్తుల కానుకల దొంగతనం/దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు రావడంతో రామాలయ ట్రస్ట్‌పై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పారదర్శకతను పెంచడానికి, పరిపాలనను బలోపేతం చేయడానికి ట్రస్ట్ ఓ ప్రొఫెషనల్ సీఈఓను నియమించాలని నిర్ణయించింది. ట్రస్ట్ ట్రెజరర్ గోవింద్ దేవ్ గిరి మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా నిరోధించడానికి, సంస్థాగత జవాబుదారీతనాన్ని పెంచడానికి అనుభవజ్ఞుడైన అధికారి అవసరం ఉందని స్పష్టం చేశారు.సీఈఓ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి జూలై 18 వరకు గడువు ఉంది. దీనికి కీలకమైన 15 నిబంధనలు/అర్హతలను విధించారు.హిందూ మతాచారాలు పాటించే వ్యక్తి: దరఖాస్తుదారు తప్పనిసరిగా హిందూ మతాన్ని ఆచరించే వ్యక్తి, రామభక్తుడై ఉండాలి.పరిపాలనా అనుభవం: పెద్ద సంస్థలను విజయవంతంగా నడిపించిన సుదీర్ఘ పరిపాలనా అనుభవం కలిగి ఉండాలి.పెరుగుతున్న భక్తుల రద్దీని తట్టుకునేలా రోజువారీ ఆలయ పరిపాలనను పర్యవేక్షించడం, ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్దడం, సిబ్బందిని నిర్వహించడం కొత్త సీఈఓ ప్రధాన బాధ్యతలు. ఈ నేపథ్యంలో ఈ పదవి ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## మహిళా న్యాయమూర్తిపై వృద్ధురాలి చేతబడి.. సీటుపై తెల్ల ఆవాలు చల్లి..



ఓ కేసులో తనకు అనుకూలంగా తీర్పు రావాలన్న ఉద్దేశంతో 65 ఏళ్ల ఓ వృద్ధురాలు పిచ్చి పనికి తెరతీసింది. మహిళా న్యాయమూర్తిపై చేతిబడికి పూనుకుంది. కోర్టులో మహిళా న్యాయమూర్తి కూర్చునే సీటుపై చేతబడికి సంబంధించిన కార్యకలాపాలు చేసింది. సీసీటీవీ కెమెరాల కారణంగా ఆమె చేసిన పని వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఈ సంఘటన కర్ణాటకలో ఆలస్యంగా వెలుగుచూసింది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిక్కబళ్లాపూర్‌కు చెందిన మంజుల అనే వృద్ధురాలికి సంబంధించిన కేసు 'ఫస్ట్ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జ్ అండ్ కోర్ట్ ఆఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు'లో నడుస్తోంది. తీర్పు తనకు అనుకూలంగా రావాలన్న ఉద్దేశంతో మంజుల ఓ పిచ్చి పనికి తెరతీసింది. కొద్దిరోజుల క్రితం కోర్టులోని మహిళా న్యాయమూర్తి సీటుపై తెల్ల ఆవాలు చల్లి చేతబడి చేసింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. కోర్ట్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంజులను అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఇక, ఈ సంఘటనపై పోలీసు ఉన్నతాధికారులు మీడియాతో మాట్లాడుతూ.. 'రెండు రోజుల క్రితం నిందితురాలు న్యాయమూర్తి సీటుపై తెల్ల ఆవాలు చల్లుతున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డు అయ్యాయి' అని అన్నారు.

## తాగునీటిని వృధా చేస్తే జరిమానా విధింపు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

నిజామాబాద్, జూలై 14 : ఎక్కడ కూడా తాగునీరు వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా తాగునీటిని వృధా చేస్తే జరిమానాలు విధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రూ. 10 వేలు, గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 5వేల జరిమానా విధించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం తాగునీటి సరఫరా, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల పెంపుదల తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, శ్రీరాంసాగర్ రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగు, సాగునీటి అవసరాలకు అవి ఏమేరకు సరిపోతాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి తాగునీటిని




ఏమాత్రం వృధా చేయకుండా, భవన నిర్మాణాలు వంటి ఇతర అవసరాలకు మళ్లించకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటిని వృధా చేస్తే, బాధ్యులకు జరిమానాలు విధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని నివాస ప్రాంతాలకు, ప్రజల అవసరాలకు సరిపడా రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు అన్ని నివాస ప్రాంతాలలో తాగునీటి సరఫరా స్థితిగతులను పరిశీలించి సంయుక్తంగా సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. వర్షపు నీటిని ఒడిసిపడుతూ, భూగర్భ జలాలు వృద్ధి చెందేలా అవకాశం ఉన్న చోట ఫాంపాండ్స్, ఇతర వాటర్ షెడ్ నిర్మాణాలు జరిపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పడిపోయిన చోట, నీటి వనరుల లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రాధాన్యత క్రమంలో వీటి నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ఎక్కడ కూడా తాగునీటి విషయమై ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా ఖరీఫ్ పంటల సాగుకు ఆయా ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు అవసరమైన మొదటి, రెండు తడులు నీటిని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి ప్రకాశ్, ఆర్.డబ్ల్యూ.ఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి'

### బూర్గంపహాడ్ ఎంఈఓకు టీయూడబ్ల్యుజే(ఐజేయూ) వినతి




బూర్గంపహాడ్, జూలై 14 : బూర్గంపహాడ్ మండలంలో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యుజే(ఐజేయూ) కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రత్నం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి శ్రీహరిబాబు, డొంకన చంద్రశేఖర్ల ఆధ్వర్యంలో మంగళవారం పలువురు జర్నలిస్టులు ఎంఈఓ యదుసింహరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బర్ల జోషి మాట్లాడుతూ.. జరల్నిస్టుల పిల్లలకు ఫీజు విషయంలో 50 శాతం రాయితీ కల్పించాలని, ఇప్పటికే దీనిపై జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు సైతం జారీ చేసిందని, మండలంలో అది అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓను కోరారు.దీనికి స్పందించిన ఎంఈఓ త్వరలో మండలంలోని అన్ని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆదేశాల అమలుపై చర్చించి అర్హత కలిగిన జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ సహాయ కార్యదర్శి సాంబరెడ్డి, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సభ్యులు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు శివకుమార్, ఈసీ మెంబర్ రవి, సభ్యులు శ్రీనివాస్, రాంబాబు, కోట రమేష్, జక్కిరెడ్డి మల్లారెడ్డి, చేతుల శ్రీనివాస్, సుధాకర్, ముజాఫర్, కేసుపాక రాజు పాల్గొన్నారు.

## బూర్గంపహాడ్‌లో యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


### పట్టించుకోని అధికార యంత్రాంగం



బూర్గంపహాడ్, జూలై 14 : బూర్గంపహాడ్ మండలంలో ఇసుక అక్రమ రవాణా యధేచ్ఛగా సాగుతోంది. మండల పరిధిలోని బుడ్డగూడెంతో పాటు సారపాక బ్రిడ్జి కింద అక్రమార్కులు ఇసుక రవాణాను జోరుగా సాగిస్తున్నారు. ఒక పక్క గోదావరి వరద వస్తున్నప్పటికీ పట్టపగలే ఈ అక్రమ రవాణాకు తెరలేపారు. గోదావరి, కిన్నెరసాని వాగు పరిధిలో అక్రమార్కులు ట్రాక్టర్లలో ఇసుకను లోడ్ చేసి యధేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నా సంబంధిత రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. అంతేకాకుండా అధికారిక ఇసుక ర్యాంపుల్లో అనధికారికంగా జీరో దందా నడుపుతున్నారన్న ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇసుకను చేతులతో లేదా పరిమితంగా తీయాల్సి ఉండగా ర్యాంపుల్లో భారీ యంత్రాలను ఏర్పాటు చేసి అనుమతులకు మించి లోతుతో ఇసుక తోడుతూ ఈ వ్యాపారం సాగిస్తున్నారు.ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి పలుమార్లు మీడియా, సోషల్ మీడియాల్లో ప్రచురిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. అధికార పార్టీలో కొందరు తమ రాజకీయ పలుకుబడితో అక్రమ ఇసుక దందా కొనసాగిస్తున్నట్లు మండలంలో ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మండలంలోని సారపాకతో పాటు బుడ్డగూడెంలో అక్రమ ఇసుక రవాణాపై సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు మండిపడుతున్నారు.

## భోజ్‌శాలలో శుక్రవారం ప్రార్థనలు.. సుప్రీంకోర్టులో ముస్లింలకు తాత్కాలిక ఊరట

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల(లో ఉన్న వివాదాస్పద సరస్వతీ దేవి గుడి స్థలం వద్ద శుక్రవారం పూట ప్రార్థనలు జరుపుకునేందుకు ముస్లింలకు సుప్రీంకోర్టు తాత్కాలిక ఊరట కల్పించింది. వివాదాస్పద ప్రాంతానికి పక్కలో ముస్లింలకు కొంత స్థలాన్ని ప్రార్థనల కోసం కేటాయించాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఆ స్థలంలో శుక్రవారం మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య ముస్లింలు నమాజ్ చేసుకోవాలని కోర్టు సూచించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. అయితే ప్రస్తుతం వేర్వేరు పిటీషన్లపై వాదనలు




జరుగుతున్నాయని, కానీ అడ్‌హక్ పద్ధతిలో ముస్లింలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది.తమ అనుమతి లేకుండా వివాదాస్పద భోజ్‌శాల ఆలయ స్థలంలో ఎటువంటి నిర్మాణాలను చేపట్టరాదు అని పురావాస్తు శాఖకు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. భోజ్‌శాల చాలా సున్నితమైన అంశమని, హిందువులు.. ముస్లింలు సంయమనంతో ఉండాలని, ఈ సమస్యను పరిష్కరించేందుకు రోజువారీగా వాదనలు చేపట్టనున్నట్లు సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. ధార్ జిల్లాలో ఉన్న వివాదాస్పద భోజ్‌శాల– కమలా మౌలా మసీదు ఆవరణలో సరస్వతీదేవి ఆలయం ఉన్నదని మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలైన విషయం తెలిసిందే.

## జొన్నగిరి గోల్డ్ మైన్స్ విస్తరణ..




కర్నూలు, జూలై 14 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక మరియు గనుల రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుందికర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ 'జొన్నగిరి గోల్డ్ మైన్స్'బంగారు గనులు) ప్రాజెక్టు విస్తరణకు ప్రభుత్వం భారీగా భూములను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా మరో 998 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ భూసేకరణలో భాగంగా ఏపీ దేవాదాయ శాఖకు చెందిన భూములను కూడా వినియోగించుకోనున్నారు.దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 40 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన లీజు నిబంధనలు మరియు ప్రక్రియను పూర్తి చేస్తూ ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు విస్తరణ ద్వారా రాయల్టీ మరియు పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది.అంతేకాకుండా, ఈ మైనింగ్ పనులు పూర్తిస్థాయిలో ఊపందుకుంటే కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. బంగారు గనుల తవ్వకం మరియు ప్రాజెక్ట్ పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టు విస్తరణకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జొన్నగిరి గోల్డ్ మైన్స్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.

## టీడీపీలో భారీ మార్పులు

విజయవాడ, జూలై 14 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమి పరిపాలనలో దూసుకుపోతున్న తరుణంలో, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ అంతర్గత బలోపేతంపై అత్యంత కీలకమైన వ్యూహాత్మక కసరత్తును ప్రారంభించారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు ఒక భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందులో భాగంగా చాలా మంది సీనియర్లను, యాక్టివ్‌గా లేని నాయకులను పక్కన పెట్టేసి, కొత్త ముఖాలకు, యువ నాయకత్వానికి పెద్దపీట వేయాలని టీడీపీ అధిష్టానం డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి సొంత ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాలపై టీడీపీ అధిష్టానం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. గత ఎన్నికల్లో కొన్ని సమీకరణాల వల్ల వెనుకబడిన ప్రాంతాలు లేదా ఇన్‌ఛార్జ్‌లు సరిగ్గా పని చేయని చోట్ల గ్రౌండ్ లెవెల్ రిపోర్ట్ తెప్పించుకుంటున్నారు. కేవలం పేరుకే ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటూ, క్యాడర్‌ను పట్టించుకోని వారిని మార్చేయాలని చంద్రబాబు గట్టిగా ఉన్నారట. అక్కడ సమర్థులైన, ప్రజల్లో నిరంతరం ఉండే కొత్త నాయకులను ఎంపిక చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. ప్రారంభించిన సీఎం చంద్రబాబుఇక ఈ సమీక్షల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపైనా టీడీపీ అంతర్గతంగా సమీక్షలు నిర్వహిస్తోంది. కూటమి ధర్మం ప్రకారం ఆయా స్థానాలు మిత్రపక్షాలకే ఉన్నప్పటికీ, అక్కడ టీడీపీ ఓటు బ్యాంక్ చెల్లాచెదురు కాకుండా చూసుకోవడం, క్యాడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యవసరం అని భావిస్తున్నారు. భవిష్యత్తు రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, మిత్రపక్షాల స్థానాల్లో కూడా టీడీపీ బలాన్ని తగ్గకుండా చూసుకునేందుకు అంతర్గత సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.మరోవైపు, గత ఎన్నికల్లో వైసీపీ గెలుచుకున్న ఆ 11 నియోజకవర్గాలపై టీడీపీ టాప్ ప్రయారిటీ పెట్టింది. ఆ 11 స్థానాల్లో వైసీపీని పూర్తిగా ఖాళీ చేయడమే లక్ష్యంగా కసరత్తు జరుగుతోంది. అక్కడ పార్టీ ఎందుకు ఓడిపోయింది? ఎక్కడ లోపాలు జరిగాయి? అనే విషయాలపై ప్రత్యేక నివేదికలు తెప్పించుకున్నారు. ఆ నియోజకవర్గాల్లో ప్రస్తుత ఇన్‌ఛార్జ్‌ల పనితీరును బేరీజు వేస్తున్నారు. ఒకవేళ వారి వల్ల పార్టీ పుంజుకునే అవకాశం లేదని తేలితే, క్షణం కూడా ఆలోచించకుండా వారిని పక్కన పెట్టి.. ఆర్థికంగా, అంగబలం పరంగా, ప్రజల్లో క్రేజ్ ఉన్న సరికొత్త సమర్థ నాయకులను రంగంలోకి దించేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.ఇక అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈసారి సమీక్షల్లో కేవలం "పనితీరు" మాత్రమే ఏకైక ప్రామాణికం అని చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎంతటి సీనియర్ నాయకుడైనా, గతంలో ఎంత పెద్ద పదవి అనుభవించినా సరే.. ఇప్పుడు క్షేత్రస్థాయిలో యాక్టివ్‌గా లేకపోతే, సమన్వయ కమిటీలు సరిగ్గా నడపకపోతే వారిని తప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. చాలా మంది పాత తరం నేతలను పక్కన పెట్టేసి, కొత్త వారికి, యువతకు ఛాన్స్ ఇవ్వాలనే గట్టి ఆలోచనలో అధిష్టానం ఉంది.



# రావణ్ విషయంలో నేతల యూ టర్న్

విజయవాడ, జూలై 14 ఏపీలో ఆసక్తి రేకెత్తించిన జోసెఫ్ రావణ్ అలియాస్ ప్రశ్న రావణ్ వ్యవహారంపై కొత్త కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. జనసేన అదినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై అసభ్య పదజాలాన్ని ప్రయోగించిన కేసులో అరెస్టు అయిన రావణ్ కు న్యాయ సహాయం చేసిన ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్? తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ప్రశ్న రావణ్ తో తనకు అంతగా సంబంధాలేమీ లేవని చెప్పిన శ్రావణ్? రావణ్ కు అతడి కుటుంబం నుంచి కూడా పెద్దగా మద్దతు లేదని సంచలన వ్యాఖ్య చేశారు. రావణ్ వ్యవహారంలో విపక్ష వైసీపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని కూడా శ్రావణ్ ఆరోపించారు.ప్రశ్న రావణ్ తో తనకు పెద్దగా స్నేహమే లేదని శ్రావణ్ తెలిపారు. ఆకివీడు వ్యవహారంలోనే తనకు రావణ్ తో పరిచయం అయ్యిందని, ఆ తర్వాత తన ఇంటర్వ్యూ కోసం రావణ్ తనను సంప్రదించారని తెలిపారు. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా కేవలం ఒకటి రెండు సార్లు మాత్రమే తాను రావణ్ తో ఫోన్ లో మాట్లాడానని ఆయన తెలిపారు. అంతకుమించి రావణ్ తో తనకు ప్రత్యక్ష సంబంధాలేమీ లేవని కూడా ఆయన పేర్కొనడం గమనార్హం. ఇక ఓ బాధ్యత కలిగిన సామాజిక వేత్తగా, న్యాయవాదిగా మాత్రమే తాను రావణ్ కేసులను వాదించానని, అంతకుమించి రావణ్ తో తనకు మైత్రి లేదని ఆయన తేల్చేశారు.ఇక రావణ్ ఓ రేంజిలో ఎలివేట్ కావడానికి దారి తీసిన ఏలూరు బహిరంగ సభలో అంతా తన ప్రమేయం లేకుండానే జరిగిపోయిందని శ్రావణ్ పేర్కొన్నారు. ఆ సభలో వేదిక మీదకు వచ్చేవారిలో రావణ్ పేరే లేదని ఆయన అన్నారు. ఆహ్వానితుల జాబితాలో పేరు లేకున్నా.. సభ నిర్వాహకుడిగా ఉన్న తన అనుమతి లేకుండానే రావణ్ వేదిక మీదకు వచ్చారని, అంతేకాకుండా తనకంటే ముందుగానే తన అనుమతి లేకుండా రావణ్ మైకందుకుని మరీ ప్రసంగించారని ఆయన ఆరోపించారు. అయితే వేడిపై శ్రవణ్ అన్న రమ్మంటేనే వచ్చానని రావణ్ మాట్లాడడం గమనార్హం. రావణ్ చేసిన ఘాటు వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కూడా ఆయన తేల్చేశారు. తాను నిర్వహించిన సభలో తన అనుమతి లేకుండా మాట్లాడిన రావణ్ అరెస్టు అయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ మాటలు చూస్తుంటే జడ శ్రవణ్ ఈ కేసు నుండి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇక రావణ్ కు వైసీపీ మద్దతు పలుకుతున్న వైనంపైనా శ్రావణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అదికార కూటమికి చెందిన కీలక నేతలపై పరుష పదజాలంతో విరుచుకుపడుతున్న ప్రతి ఒక్కరికి వైసీపీ నుంచి మద్దతు లభిస్తోందని ఆయన అన్నారు. అందులో భాగంగానే రావణ్ కు వైసీపీ నుంచి మద్దతు లభించిందని ఆయన అన్నారు. అయితే రావణ్ హిందూ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిన తర్వాత వైసీపీ అతడి నుంచి దూరం జరగాలని భావించిందని, అయితే అది అంత ఈజీ కాదన్న విషయం తెలుసుకుని వైసీపీ నేతలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. తనకు మాత్రం వైసీపీ నుంచి ఎలాంటి మద్దతు లేదని ఆయన అన్నారు. ఎంగిలి మెతుకులనూ విదల్చని మాదిరిగా వ్యవహరిస్తున్న వైసీపీ నుంచి తనకు ఎలాంటి సాయం అవసరం లేదని కూడా ఆయన ఘాటు వ్యాఖ్య చేశారు.ఇక రావణ్ వ్యవహారంలో పరిమితికి మించి స్పందిస్తున్న ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ వ్యవహారంపైనా శ్రావణ్ స్పందించారు. రావణ్, ప్రకాశ్ రాజ్ ల మధ్య చాలా కాలం నుంచే పరిచయం ఉన్నట్టుందని ఆయన వ్యాఖ్యానించారు. రావణ్ గురించి మాట్లాడేందుకే ప్రకాశ్ రాజ్ తనకు పలుమార్లు కాల్ చేశారని ఆయన చెప్పారు. ఇక రావణ్ కు అతడి కుటుంబం నుంచి ఎలాంటి మద్దతు లేదని చెప్పారు. రావణ్ కు న్యాయ సహకారంతో పాటుగా ఇతరత్రా సాయాన్ని కూడా తానే చేస్తున్నానని తెలిపారు. రావణ్ కు అన్నీ తానై సాయం చేస్తుంటే? అతడి బృందంలోని గమన అనే యువతి వైసీపీ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన తీరుపై శ్రావణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీవీ వెంకటేశ్వరరావు గత వైసీపీ పాలనలో ఎదుర్కొన్న ఇబ్బందులు తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ఆయన పదవీ విరమణ చేశారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై పలు సందర్భాల్లో తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. గతంలో కూటమి ప్రభుత్వానికి సూచనలు చేసిన సందర్భాల్లోనూ ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు.తాజాగా ఉపా చట్టం (యూఏపీఏ) వినియోగంపై తన అభిప్రాయాన్ని వెల్లడించిన ఏబీవీ, ఒక కార్యక్రమంలో మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుతో వేదికను పంచుకోవడంపై వస్తున్న విమర్శలకు స్పందించారు. ఆ వేదికపై అంబటి రాంబాబు ఏమి మాట్లాడారో తాను వినలేదని, ఆయన పక్కన కూర్చున్నాననే కారణంతో సభ మధ్యలో లేచి వెళ్లిపోవడం సభా మర్యాద కాదని చెప్పారు."మీ అందరితో హీరో అనిపించుకోవడం కోసం నేను సంస్కారం వదిలేయాలా? మీరు నా గురించి పొరబడ్డారు. నేనలాంటి వాడిని కాదు" అంటూ ఏబీవీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గతంలో జగన్ ప్రభుత్వం మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వలేదని, ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరించాలనుకుంటుందా? అని ప్రశ్నించారు.ఇంతకుముందు అమరావతి భూసేకరణ అంశంపైనా ఏబీవీ స్పందించారు. రెండో విడతలో వేలాది ఎకరాల భూమిని సేకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తే ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం కష్టమవుతుందని హెచ్చరించారు. అలాగే అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయకపోతే కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసినట్టేనని వ్యాఖ్యానించారు.అలాగే జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' అంశాన్ని కూడా తేలికగా తీసుకోవద్దని సూచించారు. యూట్యూబ్ వ్యాఖ్యలపై ఉపా చట్టాన్ని ప్రయోగించే విషయంలో రాజద్రోహం కేసు అవసరం లేదని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దీంతో కూటమి కార్యకర్తల నుంచి విమర్శలు రావడంతో, తాను చేస్తున్న వ్యాఖ్యలను సద్విమర్శలుగా స్వీకరించాలని ఏబీవీ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వరుస పోస్టులు చేస్తూ తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు.

## మార్చిలోనే పోలవరం ప్రారంభం

ఏలూరు, జూలై 14 పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమాచారం వెల్లడించారు. ప్రస్తుతం 89 శాతం మేర పనులు జరిగాయని, గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా ప్రాజెక్టు పూర్తవుతుందని, ఆ తర్వాత జాతికి అంకితం చేస్తామని సీఎం పేర్కొన్నారు. గోదావరి జిల్లాల పర్యటన సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజి వద్ద జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ పునరుద్ధరణ, పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమైన సమాచారాన్ని సీఎం పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలవరం పనులు 89 శాతం పూర్తయ్యాయని సీఎం చంద్రబాబు



వివరించారు. రెండేళ్లలోనే పనులు పరుగులు పెట్టించామని వ్యాఖ్యానించారు. 2014-19 మధ్య పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే చేసి చేతులెత్తేసిందని విమర్శించారు. 2019లో టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి చేసేవారమని సీఎం వ్యాఖ్యానించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసి వచ్చే మార్చిలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం హామీ ఇచ్చారుఇక ధవళేశ్వరం పర్యటన తర్వాత సీఎం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ముందుగా హెలికాప్టర్ నుంచి గోదావరి ప్రవాహం, ఎగువ దిగువ కాపర్ డ్యాం పనులను చూశారు. అనంతరం ప్రాజెక్టులోని ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 నిర్మాణాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేసేలా సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, కూటమి ప్రధాన ఎన్నికల హామీ అయిన పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే పూర్తి చేస్తామనే పట్టుదల ప్రభుత్వంలో కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. గత రెండేళ్లలో సుమారు 24 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్న ప్రభుత్వం పోలవరం పూర్తికి అధిక ప్రాధాన్యమిస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం స్పిల్ వేతోపాటు ఈసీఎఫ్ఆర్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఇంకా జల విద్యుత్ కేంద్రం నిర్మాణాలు మాత్రమే పెండింగులో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పూర్తయిన పనులతో కాలువలకు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సిద్ధం చేశాకే ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే ఖరీఫ్ నాటికి పోలవరం అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

## జనసేన విస్తరణకు పక్కా ప్లాన్

### బూత్ కమిటీలతో రెడీ అవ్వుతున్న కేడర్

కాకినాడ, జూలై 14 జనసేన పార్టీని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే వ్యూహానికి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా పార్టీని పోలింగు బూతు స్థాయిలో బలపేతం చేయాలనే నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. 2014లో పార్టీ ప్రారంభించిన నుంచి జనసేనాని సెంట్రిక్ గానే పార్టీ కార్యకలాపాలు నడిచాయి. మధ్యలో కొందరు కార్యకర్తలు పార్టీలో చేరిన క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణపై ఇప్పటివరకు ఫోకస్ చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఆదరణ ఉన్నప్పటికీ పోలింగు బూతు స్థాయిలో ఓటర్లను సమన్వయం చేసే కేడర్ లేక జనసేన బలం కొంతవరకే పరిమితం అన్న అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో పవన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరికొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జనసేన పార్టీకి పోలింగు బూతు లెవల్ లో కమిటీలు వేయాలని పవన్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో వాటా పొందుతోంది. స్థానిక ఎన్నికల్లో కూడా జనసేనకు ప్రాతినిధ్యం పెరగాలని, క్షేత్రస్థాయి కార్యకర్తలకు స్థానికంగా గౌరవం దక్కాలంటే స్థానిక ఎన్నికల్లో గెలవడం అత్యావసరమని జనసేనాని భావిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇటీవల పార్టీలో చేరికల కమిటీని నియమించడంతోపాటు పార్టీలో తొలి నుంచి కష్టపడిన కార్యకర్తలను గుర్తించేందుకు మరో కమిటీని నియమించారు. ఈ విధంగా పార్టీని బలోపేతం చేయడానికి పవన్ దశలవారీగా చర్యలు తీసుకుంటుండటం రాజకీయంగా చర్చనీయాంశం అవుతోంది. జనసేన పార్టీ స్థాపించి ఇప్పటికి 12 ఏళ్లు అవుతోంది. ఈ పుష్కర కాలంలో పార్టీ విస్తరణపై పవన్ ఎప్పుడు ఇంతలా దృష్టి పెట్టలేదని అంటున్నారు. దీంతో వచ్చే మూడు నెలలో జనసేన పార్టీ భవిష్యత్తు కీలక మలుపు తీసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇంకా మరో మూడేళ్లు పదవీ కాలం ఉండటం, స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండే అంచనాలు వ్యక్తమవుతుండటంతో జనసేనాని వ్యూహం సత్ఫలితాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారుఈ నేపథ్యంలో జనసేన కేడర్ లో జోష్ కనిపిస్తోంది. అదే సమయంలో ఇతర పార్టీల నుంచి పదవుల ఆశతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు జనసేనలో చేరే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తంగా జనసేనాని వ్యూహానికి తగినట్లు పార్టీని రాష్ట్రంలో 175 నియోజకవర్గాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల లోగా 175 నియోజకవర్గాల్లోనూ బూత్ కమిటీలు నియమించాలనే లక్ష్యంతో జనసేన నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ బూతు కమిటీలే పార్టీకి కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఈ పరిణామం ఒక విధంగా విపక్షంతోపాటు కూటమిలోని ప్రధాన పార్టీలు అప్రమత్తం అవ్వాల్సిన పరిస్థితులు సూచిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు

## వ్యూహం మార్చుకుంటున్న వైసీపీ?

### ఐ ప్యాక్ స్థానంలో కపిల్ సాహు

విజయవాడ, జూలై 14 2029 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న విపక్ష వైసీపీ 'సరికొత్త వ్యూహం'తో ముందుకు వస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. కూటమిలోని మూడు పార్టీలు మళ్లీ కలిసికట్టుగా పోటీ అంటుండటంతో తమ గెలుపునకు సరైన వ్యూహం అవసరమని వైసీపీ గుర్తించిందని చెబుతున్నారు. దీంతో కొత్త రాజకీయ ఎత్తుగడతో ప్రజల ముందుకు రావాలనే ఆలోచనకు ఆ పార్టీ అధిష్టానం వచ్చిందని చెబుతున్నారు. ప్రధానంగా పార్టీకి ఇప్పటివరకు రాజకీయ వ్యూహాలు అందిస్తున్న 'ఐ-ప్యాక్'ను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐ ప్యాక్ స్థానంలో తమిళనాడులోని టీవీకే పార్టీకి వ్యూహకర్తగా పనిచేసిన కపిల్ సాహును వ్యూహకర్తగా నియమించుకోవాలని వైసీపీ భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వైసీపీ సన్నాహాలు మొదలుపెట్టినట్లేనని అంటున్నారు రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి ఎదుర్కొన్న వైసీపీ మూడేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇందుకోసం అనేక వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇందులో ప్రధానమైనది పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాదయాత్ర ఒకటి అయితే, రెండోది పార్టీకి సరైన ఎన్నికల వ్యూహాలు అందించే బృందంగా భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సలహాలు, సూచనలతో రికార్డు విజయాన్ని సొంతం చేసుకున్న వైసీపీ.. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ బృందంలోని రిషిరాజ్ సింగ్ వ్యూహాలతో బోల్తా కొట్టింది. అయితే ఈ సారి తమిళనాడులో టీవీకే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కపిల్ సాహు వైపు చూస్తోందని కొద్దిరోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది.ప్రశాంత్ కిషోర్ బృందానికే చెందిన కపిల్ సాహు ప్రస్తుతం సొంతంగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా డిజిటల్ ప్రచారంలో కపిల్ సాహుకు మంచి గుర్తింపు ఉందని చెబుతున్నారు. తమిళనాడులో టీవీకే పార్టీకి రాజకీయ వ్యూహాలు అందించిన కపిల్ సాహు సైలెంట్ గా టార్గెట్ ను కొట్టడమే హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నికలకు ముందు ఎటువంటి అంచనాలు లేని టీవీకేని ఏకంగా ప్రభుత్వంలోకి తీసుకురావడానికి కపిల్ సాహు వ్యూహాలు బాగా పనికొచ్చాయని చెబుతున్నారు. రెండు బలమైన ప్రాంతీయ పార్టీలను మట్టి కరిపించి టీవీకేను ఓటర్లకు చేరువ చేయడంలో కపిల్ సాహు సక్సెస్ అయ్యారని అంటున్నారు. ఇదే అంశం వైసీపీని ఆకర్షిస్తోందని అంటున్నారు. కూటమి పార్టీలు కలిసి వుంటే ఓట్లు చీలడం కష్టమనే అభిప్రాయంతో ఉన్న వైసీపీ.. కూటమికి విరుగుడుగా వ్యూహాలు రచించే సరైన స్ట్రాటజిస్టు కోసం అన్వేషిస్తున్న క్రమంలో కపిల్ సాహు పేరు తెరపైకి వచ్చిందని అంటున్నారు. దీంతో ఆయనతో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. కపిల్ సాహుతో ఒప్పందం కుదిరితే రిషిరాజ్ సింగ్ కు చెందిన ఐ-ప్యాక్ స్థానంలో కపిల్ సాహు సెల్ఫ్-ఎంప్లాయిడ్ బృందం తెరపైకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. కాగా, వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తలపైనే ఆధారపడాలా? అన్న ప్రశ్న పార్టీలో విస్తృతంగా వినిపిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీకి మరమ్మతులు చేయకుండా ఏం చేసినా ఉపయోగం లేదనే వాదన బలంగానే వ్యక్తమవుతోందని చెబుతున్నారు.



# పి ఆర్ సి కమిటీ ఐ ఆర్ కోరుతూ కర్నూలు లో ఫ్యాప్టో గా ఉపాధ్యాయుల భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శన...



విభారే న్యూస్ జూలై 14 కర్నూలు జిల్లా ప్రతినిధి..మంగళవారం రోజు ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయం నుండి కర్నూలు జిల్లా కలెక్టరేట్ వరకు సుమారు 500 మంది పైగా ఉపాధ్యాయులు ఫ్యాప్టో అధర్వ్యం లో భారీగా ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ ని ఆంధ్ర ప్రదేశ్ ఫ్యాప్టో కో చైర్మన్ కర్నూలు జిల్లా ఇంచార్జి కాకి ప్రకాష్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఉపాధ్యాయులు, మహిళ టీచర్లు పి ఆర్ సి కమిటీ నియమించాలి, ముప్పై శాతం ఐ ఆర్ ప్రకటించాలి అని నినాదాలు చేస్తూ రాజవిహార్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకుని కార్యాలయం ముందు బైఠాయించడం జరిగింది. కలెక్టరేట్ ముందు జరిగిన పికెటింగ్ కు కర్నూలు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం మధుసూదన్ రెడ్డి, సెక్రటరీ జనరల్ భాస్కర్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్, ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారం లో రాకముందు ఉద్యోగ మరియు ఉపాధ్యాయ లోకం నకు చేసిన హామీ మరచి పోయింది, అందుకనే నేడు ఫ్యాప్టో నాయకత్వం లో అన్ని జిల్లాల యందు ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. అధికారం లో రాగానే మెరుగైన పి ఆర్ సి ఇస్తామని ఇంత వరకు దాని గురించి ప్రస్తావన లేదు. అడిగితే ఊపిరి పీల్చుకొనివ్వండి అని అంటున్నారు , ఇంకెంత కాలం ఓపిక పట్టాలి అని ప్రభుత్వం ను ప్రశ్నించడానికి ఈ ఉద్యమం. ఇప్పటికైనా స్పందించాలని లేకుంటే రాష్ట్ర స్థాయిలో భారీ ఉద్యమం చేపడతామని ప్రభుత్వమును హెచ్చరించారు. యు టి ఎఫ్ జిల్లా నాయకుడు రవి కుమార్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల కు పైగా ఉపాధ్యాయుల సరెండర్ లీవ్ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. వాటి చెల్లింపు కొరకు ఎన్ని మార్లు వినతి చేసిన లాభం లేదు. కాబట్టి వెంటనే సరెండర్ లీవ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు చేయాలని, దీని విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని చట్ట సవరణ కు కేంద్రం నకు సిఫార్సు చేయవలసిన అవసరం ఉందని అన్నారు.ఎ పి టి ఎఫ్ 257 నాయకుడు పాండు రంగ రెడ్డి మాట్లాడుతూ ఎంప్లాయ్ హెల్త్ కార్డ్స్ ద్వారా ఉద్యోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందించడం లో ప్రభుత్వం వైఫల్యం చెందింది, దీనిని వెంటనే సరిదిద్దుకుని పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని కోరారు.ఎ పి టి ఎఫ్ 1938 నాయకుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ కారుణ్య నియామకం లు ఉపాధ్యాయుల పిల్లల కు పూర్తి స్థాయిలో చేయలేకపోవటం వలన అనేక వందల కుటుంబాలు వాటి కొరకు ఎదురు చూస్తున్నాయి. వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయ సంఘము నాయకులు నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉమ్మడి సర్వీస్ రూల్స్ ను అమలు లో తేకపోవడం వలన పాఠశాల విద్య లో జూనియర్ లు కూడా సీనియర్ ల పై అధికారం చెలాయింపు చేస్తున్నారు. దీని వల్ల సీనియర్ లు అసంతృప్తి తో ఉన్నారు అని వెంటేనే ఉమ్మడి సర్వీస్ రూల్స్ తేవడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు.డి టి ఎఫ్ నాయకులు భీమన్న మాట్లాడుతూ సి పి ఎస్ ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ను అమలు లోకి తేవాలని, ఈ విషయం లో ఉపాధ్యాయ సంఘాలు అనేక సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్న ప్రభుత్వం లో చలనం లేకుండా ఉందని, దీని వల్ల ఉపాధ్యాయుల యందు తీవ్ర అసంత్రుప్తి నెలకొంది అని అన్నారు.ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా నాయకుడు గోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమం లు ఏమి పెట్టకూడదు, బోధన, అభ్యసన కార్యక్రమాలు తప్ప మరే ఇతర విషయాలు కూడా చెప్పకూడదు అని డిమాండ్ చేశారు.పి ఈ టి అసోసియేషన్ లక్ష్మయ్య మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నియామకం లో సీనియారిటీ ని పరిగణన లో తీసుకోవడానికి అధికారులు కుంటి సాకులు చెబుతున్నారు అని వెంటనే సీనియారిటీ ని పరిగణన లో తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. బి టి ఎ నాయకులు నందీశ్వరుడు, వెంకటేష్ మాట్లాడుతూ 2025లో బదిలీ అయి ఇంతవరకు బదలీ కానీ వారిని వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ ఫాప్టో పికెటింగ్ కార్యక్రమం లో యు టి ఎఫ్ నుండి నవీన్ , హేమంత్, యెహోషువ ఎస్ టి యు నుండి సుంకన్న, గొకారి, శ్రీధర్, వీరచంద్ర యాదవ్ ఎ పి టి ఎఫ్ 257 నుండి ఖాసీం జి,రవికుమార్ ఎ పి టి ఎఫ్ 1938 నుండి లక్ష్మయ్య, మరియానందం, వెంకట శేషయ్య ప్రధానోపాధ్యాయ సంఘము నుండి హుస్సేన్, రమేశ్ డి టి ఎఫ్ నుండి వెంకట్రాముడు, తిమ్మప్ప, కరే కృష్ణ ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నుండి నాగార్జున, శివ శంకర్, తేజ, అమర్ పి ఈ టి అసోసియేషన్ నాయక్, ఆయా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.ఈ ఉద్యమం నకు మద్దతు గా సి ఐ టి యు అంజి బాబు, ఎ ఐ టి యు సి మునెప్పు, పి డి ఎస్ యు భాస్కర్, డి ఎస్ ఎఫ్ ఉదయ్, పిడిఎస్ఓ తిరుమలేష్ ఎ పి జె ఎ సి నాయకులు జవహర్, ఎ పి ఎన్ జి ఓ నాయకుడు ఖాసిమన్న వివిధ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.ఈ నిరసన ప్రదర్శన అనంతరం కర్నూలు జిల్లా కలెక్టరు కి ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ప్రకాష్ రావు, జిల్లా నాయకులు మెమొరాండం సమర్పించారు.

## నంద్యాలకు తాగునీటి కొరత లేదు---

### మున్సిపల్ ఎంఈ నాగభూషణ రెడ్డి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 14:నంద్యాల పట్టణానికి తాగునీటి సరఫరాపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, ప్రజలకు నిరంతరాయంగా మంచినీటిని అందించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణ రెడ్డి తెలిపారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, వెలుగోడు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.808 టీఎంసీల నీటి నిల్వ అందుబాటులో ఉందన్నారు. నంద్యాల పట్టణానికి ఏడాది పొడవునా తాగునీటి అవసరాలకు 0.73 టీఎంసీల నీరు సరిపోతుందని వివరించారు.ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిల్వలను



దృష్టిలో ఉంచుకుంటే పట్టణానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడే అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మంచినీటిని అందించేలా మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరా వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన నిర్వహణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తాగునీటి విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, మున్సిపాలిటీపై పూర్తి విశ్వాసం ఉంచాలని మున్సిపల్ ఎంఈ నాగభూషణ రెడ్డి కోరారు.

## నంద్యాల ఏఎస్పీగా సుస్మిత బాధ్యతల స్వీకరణ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 14:భారత పోలీసు సేవ (ఐపీఎస్) అధికారి సుస్మిత మంగళవారం నంద్యాల అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఏఎస్పీ)గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా పోలీసు అధికారులతో ఆమె సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు సత్వర పోలీసు సేవలందించే అంశాలపై చర్చించినట్లు సమాచారం.ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలకు




అందుబాటులో ఉండే విధంగా పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానని, చట్టవ్యవస్థ పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తానని ఏఎస్పీ సుస్మిత పేర్కొన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. జిల్లా పోలీసు శాఖలో ఆమె బాధ్యతల స్వీకరణకు ప్రాధాన్యత నెలకొంది.

## ఓటరు సవరణ గడువు జూలై 24 వరకు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 14:ఓటరు జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటి సర్వే ద్వారా ఎన్యూమరేషన్ పత్రాల స్వీకరణ గడువును ఈ నెల 24 వరకు భారత ఎన్నికల సంఘం పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా మంగళవారం ఒక ప్రకటనలో



తెలిపారు.భారత ఎన్నికల సంఘం తాజా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని, ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తి చేసి సంబంధిత బీఎల్‌వోలకు లేదా నిర్ణీత కేంద్రాల్లో ఈ నెల 24లోపు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.సవరించిన షెడ్యూల్ ప్రకారం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. అనంతరం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, దావాలు స్వీకరించనున్నారని, వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 28 వరకు కొనసాగుతుందని వెల్లడించారు. అన్ని అభ్యంతరాల పరిష్కారం అనంతరం అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు.ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా విజ్ఞప్తి చేశారు.

## ఎల్‌నినోపై రైతులకు కీలక సూచనలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 14: ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) నంద్యాల శాస్త్రవేత్తలు సూచించారు. రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు అందించేందుకు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎల్‌నినో మానిటరింగ్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జూలై నెలలో జిల్లాకు సాధారణంగా 116 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 6 మి.మీ. మాత్రమే కురిసిందని, దీంతో జిల్లాలోని 30 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న



సాగును తగ్గించాలని, ఇప్పటికే విత్తిన పంటలకు లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బోరు నీటితో సాగు చేస్తున్న పంటలకు వరుస విడిచి వరుసకు నీటిపారుదల చేపట్టడం, తక్కువ కాలంలో వచ్చే మినుములు, కొర్రలు, సజ్జలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం, నేలలో తేమ నిల్వ ఉండేలా అంతర కృషి చేపట్టడం మంచిదన్నారు.జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు ఆర్. గంగాధర్‌రావు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు, వ్యవసాయ శాఖ చర్యలను వివరించారు. అనంతరం నిర్వహించిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాదరావు పంటల బీమా, ప్రభుత్వ సహాయ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు శాస్త్రీయ సూచనలు పాటిస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులు సూచించారు.

## లోయలో పడిన టిప్పర్.. తప్పిన ఘోర ప్రమాదం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 14:నంద్యాల?గిద్దలూరు ప్రధాన రహదారిలో పచ్చర్ల గ్రామం సమీపంలోని నల్లమల అరణ్యంలో మంగళవారం టిప్పర్ లోయలో పడింది. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళుతున్న టిప్పర్‌కు ఎదురుగా మార్కాపురం ఆర్టీసీ బస్సు రావడంతో డ్రైవర్ బస్సును తప్పించే క్రమంలో కల్వర్టును ఢీకొని లోయలో పడిపోయింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 60 మంది ప్రయాణికులు పెను ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. టిప్పర్ డ్రైవర్ క్షేమంగా ఉన్నట్లు సమాచారం.

## నేటి నుండి 23వ తేదీ గురువారం వరకు శ్రీ మహా గౌరీ అమ్మవారి నవరాత్రులు..

విభారే న్యూస్ జూలై 14 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయగురుదత్త శ్రీ గురు దత్త ఓం శ్రీమాత్రే నమః శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో 15.07.2026 బుధవారం నుండి 23-07-2026 గురువారం వరకు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ మహాగౌరీ అమ్మవారి ( ఆషాఢ మాస ) వారాహీ నవరాత్రులు (గుప్త నవరాత్రులు) జరుగును. ఈ వారాహీ అమ్మవారు శ్రీ లలితా మహాత్రిపుర సుందరి దేవి యొక్క సర్వ సైన్య అధ్యక్షురాలు. ఈ దేవిని వార్తాళి , దండనాధ, పంచమి మొదలైన నామాలతో అర్చిస్తారు. ఈ వారాహీ అమ్మవారు శ్రీలలితా దేవి యొక్క ఆజ్ఞాచక్ర స్థానం నుండి ఆవిర్భవించినది. ఆషాఢ మాసంలో ఈ వారాహీ అమ్మవారి ఆరాధన వలన భక్తులకు గొప్ప రక్షణ శక్తి లభిస్తుంది. ఈమె యొక్క అనుష్ఠానం, అర్చన, హోమాల వలన జీవితంలో ఎదురైయ్యే సమస్త కష్ట, నష్టాలు శత్రు, రుణ, రోగ బాధలు,



న్యాయసంబంధ, భూసంబంధ సమస్యలు తొలిగిపోతాయి. అమ్మవారు గొప్ప క్రియాశక్తి స్వరూపిణి కావున పాడి పంటలను సమృద్ధిగా అనుగ్రహిస్తుంది. ఈ అమ్మవారి అర్చన అనుష్ఠానము రాత్రి సమయములో చేయుట సంప్రదాయం.శ్రీ విద్యా సంప్రదాయంలో అమ్మవారి, అర్చన అనుష్ఠానమునకు విశేష స్థానము ఇవ్వబడినది. కావున భక్తులు నవరాత్రులలో పాల్గొని అమ్మవారి అనుగ్రహమునకు పాత్రులు కాగలరు. ఈ తొమ్మిది రోజులు ఉదయం 9.30 గం లకు లలితా సహస్ర నామార్చన రాత్రి 6.30 నుండి 8.00 గం ల వరకు వారాహీ సహస్ర నామార్చన జరుగును. 23-07-2026 గురువారం రోజున వారాహీ నవరాత్రుల ముగింపు సందర్భంగా సాయంకాలం 5:30 గం''లకు అంగ,ఉపాంగ, ప్రత్యంగ,దేవత సహిత, వారాహి,మూలమంత్ర,హోమ సహిత,వారాహీ, సహస్రనామ,హోమము జరపబడును.వారాహీ హోమం ప్రధానంగా-4000/- హోమ సంకల్పం-116/- 9 రోజుల పూజకు-300/-..ఈ పూజలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి డాలరు , కుంకుమ ప్రసాదముగా ఇవ్వబడును. సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ :- 8008774086ఫోన్ పే, గూగుల్ పే నెంబర్..8896123777ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబర్..08518-234388..

## పట్టణ శుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం-

### మున్సిపల్ కమిషనర్ బి శేషన్న--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 14: పట్టణ శుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ బి శేషన్న మాట్లాడుతూ పారిశు ద్ధ్య కార్మికులు అంకితభావంతో పని చేస్తున్నా రని తెలిపారు. ఇబ్బందులు ఎదురైనా, పరిక రాలు సక్రమంగా పని చేయకపోయినా.. అధి కారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాలనీల్లో నిర్ణీత సమ యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలువల్లో వ్యర్థా లను తొలగించాలని పేర్కొన్నారు.కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్. శభరిష్. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ఓటర్లకు మరో అవకాశం--

### అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 14:ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పు, పేరు తొలగింపు తదితర దరఖాస్తుల సమర్పణ గడువును భారత ఎన్నికల కమిషన్ ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు నంద్యాల అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో



తెలిపారు. ముందుగా నిర్ణయించిన గడువులో దరఖాస్తులు సమర్పించలేకపోయిన అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుందని ఆయన పేర్కొన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిన వారు, ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు చేయించుకోవాల్సిన వారు జూలై 24లోగా సంబంధిత బీఎల్‌వోలు లేదా ఎన్నికల అధికారులకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.ప్రజలు చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే తమ దరఖాస్తులను అందజేసి ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ శ్రీనివాసులు కోరారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190